సాక్షి
కామారెడ్డి
శనివారం । 3 । జూన్ । 2023



నేడు రైతు దినోత్సవం..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవాన్ని నిర్వహించాలని అధికారులు సూచించారు.

- 9లో ▸



పార్టీని పణంగా పెట్టి..

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆంధ్రలో పార్టీని పణంగా పెట్టి తెలంగాణ ఇచ్చారని ఆ పార్టీ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
42.6 /29.9

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి కాయకల్ప అవార్డు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి కాయకల్ప అవార్డు వచ్చినట్లు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్ శుక్రవారం తెలిపారు. ఎల్లారెడ్డి ఆస్పత్రి 2023 సంవత్సరానికి కాయకల్ప అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. అవార్డుకు ఎంపికయ్యేందుకు సహకరించిన ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు సూపరింటెండెంట్ కృతజ్ఞతలు తెలిపారు.

రామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి..

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రాష్ట్రస్థాయిలో ప్రకటించిన కాయకల్ప అవార్డుల్లో రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి రెండో స్థానం దక్కింది. వివిధ రకాల సేవలు అందించడంలో 83 శాతం రావడంతో రెండో స్థానం వచ్చినట్లు రామారెడ్డి ఆస్పత్రి వైద్యుడు సురేశ్ తెలిపారు. ఆస్పత్రిలో ఓపీ, సాధారణ కాన్పులు, వ్యాధి నిరోధక టీకాలు మొదలగు సేవలను ప్రజలకు ఎక్కువశాతం అధించడం వల్ల అవార్డు దక్కిందన్నారు.

తపాలా కార్యాలయంలో ఆధార్ సేవలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి తపాలా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ సేవలను ప్రారంభించినట్లు కామారెడ్డి తపాలా శాఖ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి పదేళ్లకు ఒకసారి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి అని, అందువల్ల తపాలా శాఖ ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త ఆధార్ నమోదు ఉచితమని, వివిధ సేవలకు యాభై రూపాయల ఫీజు ఉంటుందని తెలిపారు.

నేడు పద్మాజీవాడి చౌరస్తాకు స్పీకర్, ఎమ్మెల్సీ రాక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పద్మాజీవాడి చౌరస్తా వద్ద గల రైతు వేదికకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత రానున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగాగౌడ్‌లు తెలిపారు. సమావేశం అనంతరం సహపంక్తి భోజనాలు చేస్తారన్నారు.

బ్రిజ్‌భూషన్‌పై చర్యలు తీసుకోవాలి

సాక్షి, కామారెడ్డి: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కామారెడ్డి న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీనియర్ న్యాయవాదులు జి.జగన్నాథం, పీఎల్ నర్సింహారెడ్డి, క్యాతం సిద్ధరాములు, వెంకట్రాంరెడ్డి, ఎస్.సంజీవరావ్, చింతల గోపి, ఎం.శ్రీనివాస్‌రావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, వేణు ప్రసాద్, ఎస్.గోవర్ధన్, డి.సూర్యప్రసాద్ తదితరులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముప్పై మంది రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా బాధ్యుడిపై చర్యలు తీసుకోకపోగా, రెజ్లర్లపైనే పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. వేధింపులకు గురిచేసిన బ్రిజ్ భూషన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ యూనివర్సిటీ సెలవులు రద్దు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి జూన్ 1నుంచి 9వరకు ప్రకటించిన సెలవులను రద్దు చేస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ రవీందర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సెలవులపై శుక్రవారం వీసీ రవీందర్‌తో విద్యార్థి సంఘాల నాయకులు వాగ్వాదానికి దిగారు. తాత్కాలికంగా సెలవులను రద్దు చేయడం కాదని, అధికారికంగా సర్క్యులర్ జారీ చేసేదాకా ఛాంబర్ నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. దీంతో సెలవులను రద్దు చేస్తున్నట్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వీసీ ప్రకటించారు. విద్యార్థులకు తరగతులు శనివారం నుంచి ప్రారంభమవుతాయని సర్క్యులర్ జారీ చేశారు.

నేడు జాబ్ మేళా

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సాందీపని కళాశాలలో టాస్క్, నాంధీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తిచేసి అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెటిరో, విప్రో, హెచ్-1, ఈఎంఆర్ఐ గ్రీన్, ఎంఎస్ఎన్, వరుణ్ ఆటోమొబైల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

అన్నిరంగాల్లో అగ్రగామిగా..



కామారెడ్డిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



వేదికపై ప్రముఖులు

- దేశం మొత్తం తెలంగాణవైపే చూస్తోంది
- రైతుబంధు ప్రపంచంలో మరెక్కడా లేదు
- సీఎం కేసీఆర్‌ది ధర్మపాలన
- దశాబ్ది వేడుకల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న పోచారం

సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మానవీయ దృక్పథం, నిర్మాణాత్మకమైన ఆలోచనలతో తొమ్మిదేళ్ల కాలంలోనే దేశంలో అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో స్పీకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ జితేష్ వి పాటిల్ సారథ్యంలో జిల్లా యంత్రాంగం క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ సింధే, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, అదనపు కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, చంద్రమోహన్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఎఫ్‌వో నిఖిత, జెడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేంకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రగతి నివేదికను తన ప్రసంగంలో వినిపించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత పెరగడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు స్టాల్స్‌ను సందర్శించకుండానే కార్యక్రమం ముగించారు.

రైతులు ముందస్తుగా పంటలు సాగుచేయాలి

అకాల వర్షాలు, వడగండ్ల మూలంగా ప్రతిసారి నష్టం జరుగుతోందని, రైతులు ముందస్తుగా పంటలు సాగు చేయడంపై దృష్టి సారించాలని స్పీకర్ కోరారు. జూన్ మొదటివారంలోనే నారుమడులు పోసుకోవాలని సూచించారు. యాసంగిలో నవంబర్‌లోనే పంటలు మొదలుపెట్టాలన్నారు. తద్వారా అకాల వర్షాలు, వడగండ్ల నష్టాలను అధిగమించవచ్చని సూచించారు. సీఎం కేసీఆర్ సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందన్నారు. రూ. 270 కోట్ల వ్యయంతో చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టామన్నారు. సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. నాగమడుగు పథకం ద్వారా జుక్కల్ నియోజకవర్గానికి ఎంతో మేలు కలుగుతుందని వివరించారు.

మహిళా సాధికారత కోసం..

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత సాధించేందుకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందని స్పీకర్ వివరించారు. బ్యాంకు లింకేజీ ద్వారా 13,669 స్వయం సహాయక సంఘాలకు రూ. 2,883.56 కోట్లు, స్త్రీనిధి ద్వారా 15,341 సంఘాలకు రూ. 644 కోట్ల రుణాలను అందించామన్నారు. ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం, న్యూట్రిషన్ కిట్స్, కేసీఆర్ కిట్స్ వంటి పథకాలతో గర్భిణులు, బాలింతలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.

విద్యారంగాన్ని అభివృద్ధి చేశాం

జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నామని స్పీకర్ పోచారం వివరించారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంలో భాగంగా కామారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాన్సువాడలో నర్సింగ్ కాలేజీతో పాటు మైనారిటీ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు.

మిషన్ భగీరథతో స్వచ్ఛమైన నీరు

మిషన్ భగీరథ పథకం ద్వారా 2.50 లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చామని పేర్కొన్నారు. 874 ఆవాసాలకు ప్రతిరోజూ నీరందిస్తున్నామని, అయితే అక్కడక్కడ చిన్నచిన్న సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరిస్తూ నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

పారిశ్రామిక ప్రగతి..

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు జోరుగా సాగుతోందన్నారు. జిల్లాలో రూ. 1,928 కోట్లతో 22 భారీ పరిశ్రమలు స్థాపించడం జరిగిందని, వాటి ద్వారా 2,397 మందికి ఉపాధి దొరికిందన్నారు. అలాగే చిన్న, సూక్ష్మతర హా పరిశ్రమ లు రూ. 929 కోట్లతో స్థా పించారని, వీటి ద్వారా 7,555 మందికి ఉపాధి దొరికిందన్నారు.

దేశానికే ఆదర్శం మన పల్లెలు..

పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా అన్ని గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించామని స్పీకర్ తెలిపారు. దేశంలో 20 పంచాయతీలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైతే అందులో 19 పంచాయతీలు తెలంగాణవే ఉండడం మన దగ్గర పల్లె ప్రగతికి నిదర్శనమని చెప్పారు. పట్టణ ప్రగతి ద్వారా కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ప్రగతి 'బాటలు'..

జిల్లాలో రోడ్లను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసుకున్నామని స్పీకర్ తెలిపారు. రూ. 1,100 కోట్లతో నాలుగు వందల కిలోమీటర్ల సింగిల్ వరుస రహదారులను రెండు వరుసలుగా, కొన్ని రోడ్లను నాలుగు వరుసలుగా, ఆరు వరుసలుగా అభివృద్ధి చేశామని, అలాగే 30 వంతెనలు నిర్మించుకున్నామన్నారు. రూ. 6 వందల కోట్లతో ప్రభుత్వ భవనాలు నిర్మించామని, ఇందులో కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఇలా ఎన్నో నిర్మాణాలు జరిగాయన్నారు.

పోలీసుల పనితీరు భేష్

జిల్లాలో పోలీసు శాఖ పనితీరు బాగుందని స్పీకర్ తన ప్రసంగంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని, జిల్లాలో పోలీసు శాఖ బాగా పనిచేస్తుందని అభినందించారు. మహిళలకు ఆపద రాకుండా పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు.

ఉద్యోగులు, అధికారులకు మళ్లీ నిరాశే..

రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించి సన్మానించడం ఆనవాయితీ. అయితే మిగతా జిల్లాల్లో ఉత్తమ సేవలందించిన వారిని గుర్తించి అభినందించగా, ఇక్కడ మాత్రం విస్మరించారు.

ఆసరాతో ఆదుకున్నాం

వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు.. ఇలా వివిధ వర్గాలను ప్రభుత్వం ఆసరా పింఛన్లతో ఆదుకుందన్నారు. జిల్లాలో 1,69,247 మందికి ప్రతి నెలా రూ. 36.13 కోట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు కార్యక్రమాన్ని అమలు చేశామని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తూనే వారి పిల్లలకు గురుకులాలు ఏర్పాటు చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.





వేడుకల్లో భాగంగా నృత్యం చేస్తున్న శివాయిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం

రాష్ట్రంలో రైతుల కోసం అమలు చేస్తున్న రైతుబంధు పథకం దేశంలోనే కాదు ప్రపంచంలో మరెక్కడా లేదని స్పీకర్ పోచారం పేర్కొన్నారు. కొందరు ఉచిత ఎరువులు, విత్తనాలు ఏవని అడుగుతుంటారని, పెట్టుబడి సాయం వాటికోసమేనన్న విషయం గుర్తించాలన్నారు. పది విడతల్లో కలిపి రూ. 2,500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. 2.79 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతులు ఏదేని పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబానికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రైతు బీమా పథకాన్ని తీసుకువచ్చారని, జిల్లాలో 5,453 మంది రైతులు చనిపోగా వారి కుటుంబాలకు రూ. 272 కోట్లు అందించడం జరిగిందన్నారు.

అటానమస్‌తో బహుముఖ అభివృద్ధి



కామారెడ్డి డిగ్రీ కాలేజీ ఎదుట టపాసులు కాలుస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

- సంబరాలు చేసుకున్న కామారెడ్డి డిగ్రీ కళాశాల అధ్యాపకులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు యూజీసీ స్వయంప్రతిపత్తి (అటానమస్) ప్రకటించడంతో శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం ప్రధాన ద్వారం వద్ద టపాసులు కాల్చి సంబరం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య మాట్లాడుతూ కళాశాలకు స్వయంప్రతిపత్తి రావడంతో బహుముఖంగా అభివృద్ధి చెంది గొప్ప విద్యాకేంద్రంగా పేరు తెచ్చుకుంటుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.చంద్రకాంత్, ఐక్యూఏసీ సమన్వయకర్త పి.రామకృష్ణ, అకడమిక్ సమన్వయకర్త రాజ్‌కుమార్, అధ్యాపకులు వి.శంకర్, కె.గణేశ్, టి.వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం.రామస్వామి, జె.శ్రీలత, ఫర్వీన్ ఫాతిమా, ఏవో జయలక్ష్మి, పర్యవేక్షకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దండి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా లభించినందున ఇకపై మరింత బాధ్యతతో ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రిన్సిపాల్ కె.కిష్టయ్యతో పాటు అధ్యాపకులు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, చంద్రమోహన్, వెంకటేశ్ ధోత్రేలను కలిసి యూజీసీ అటానమస్ ధ్రువపత్రాన్ని అందజేయగా ఆయన వారిని అభినందించారు. అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ కళాశాలలో సాంప్రదాయేతర ఇంధన వనరుల ఏర్పాటుపై చొరవ చూపాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.చంద్రకాంత్, ఐక్యూఏసీ సమన్వయకర్త పి.రామకృష్ణ, అధ్యాపకులు వి.శంకర్, జె.శివకుమార్, జి.శ్రీనివాస్‌రావు, రాజగంభీర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు యూజీసీ అటానమస్ ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ కిష్టయ్య

నేటి నుంచి రేషన్ డీలర్ల సమ్మె బాట

- ఇప్పటికే డిమాండ్ నోటీసు అందజేత
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- దుకాణాల మూసివేతకు సిద్ధం!

కామారెడ్డి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రేషన్ డీలర్లు సమ్మె బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు తెలిపారు. రేషన్ డీలర్ల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వ నుంచి స్పందన లేనందున సమ్మెలో పాల్గొననున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచే రేషన్ షాపులను మూసివేసేందుకు కూడా సిద్ధమయ్యారు. అయితే సమ్మె నిబంధనల ప్రకారం సుమారు 45 రోజుల ముందుగానే పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు డిమాండ్ నోటీస్ ఇచ్చారు. డీలర్ల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపకపోతే జూన్ నుంచి సరుకుల పంపిణీని నిలిపి వేసి సమ్మె చేయాలని నిర్ణయించారు. డీలర్ల సమ్మెతో ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి రానుంది. ముఖ్యంగా గ్రామాలతో పాటు పట్టణాల్లో రేషన్‌పై ఆధారపడ్డ పేద, మధ్యతరగతికి చెందిన లక్షల కుటుంబాలు సమస్యలు ఎదుర్కోనున్నాయి. గత నెల 22న రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికి ఎటువంటి చర్యలు, సర్క్యులర్ జీవోలు రాకపోవడంతో రాష్ట్ర జేఏసీ నాయకులు సమ్మెకు పిలుపునిచ్చారు. తొమ్మిదేళ్లుగా సర్కారు రేషన్ డీలర్లపై చిన్నచూపు చూస్తుందని, తమ డిమాండ్లను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె కొనసాగిస్తామని డీలర్లు చెబుతున్నారు.



రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడికి ఈ-పాస్ మిషన్లు అందిస్తున్న రేషన్ డీలర్లు

డిమాండ్లివే..

- ప్రధానంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల గౌరవ వేతనం లేదా 250 రూపాయల కమీషన్ చెల్లింపు.
- బియ్యం దిగుమతి హమాలీల ఖర్చు ప్రభుత్వమే భరించాలి.
- ఎంఎల్ఎస్ పాయింట్లలో బ్లూటూత్ కాంటల ఏర్పాటు.
- రేషన్ డీలర్లకు శాశ్వత ఆథరైజేషన్ ఇవ్వాలి.
- డీలర్లకు రావాల్సిన 40 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలి.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

భిక్కనూరు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. శుక్రవారం భిక్కనూరుకు చెందిన బోయిని పాండికి చెందిన 49 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజ్‌ల జనాభా అధికంగా ఉన్నా చాలా నిరుపేద స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వారికి ఎలాంటి సంక్షేమ పథకాలను అందించడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముదిరాజ్‌ల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఎంతో మేలు చేసిన సోనియమ్మ సంకల్పమే స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవలు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, ఎస్ఆర్‌ఐ సెల్ జిల్లా కో-ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి మండలాధ్యక్షుడు భీంరెడ్డి, పట్టణాధ్యక్షుడు అంధె దయాకర్ రెడ్డి, నేతలు గజ్జె సురేశ్, లింబాద్రి, సిద్ధాగౌడ్, స్వామి, సిద్ధరాములు, రవి, సాజీద్ పాల్గొన్నారు.



మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బోయిని పాండి సభ్యులు

క్లుప్తంగా

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాని, ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరు కావల్సి ఉంటుందన్నారు. నిజామాబాద్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఖిల్లా)లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మీరాకుమారిని కలిసిన మాజీ మేయర్ సంజయ్



ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లో లోకసభ మాజీ స్పీకర్ మీరాకుమారిని కాంగ్రెస్ సీనియర్ నేత, నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ శుక్రవారం కలిశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆమె హైదరాబాద్‌కు రాగా మర్యాదపూర్వకంగా కలిశారు.

యథేచ్ఛగా ఇసుక దందా

- గాండ్లపేట్ శివారులోని ఒర్రె నుంచి తరలింపు



మోర్తాడ్: మండలంలోని గాండ్లపేట్ శివారులోని ఒర్రె, పెద్దవాగు నుంచి ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే పట్టపగలే ఇసుకను దోచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వాగు, ఒర్రె నుంచి ఇసుకను తోడి రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రిపూట పెద్ద వాహనాల్లో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో గుర్తింపు పొందిన ఇసుక పాయింట్లు సుంకెట్, పాలెం మాత్రమే ఉన్నాయి. వాల్టా నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి రుసుం చెల్లించి ఇసుకను తరలించాలి. ఇసుక అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది.

పార్టీ బలోపేతానికి కృషి



కామారెడ్డి టౌన్: జిల్లాలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ బలోపేతం కోసం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో చర్చించినట్లు రాష్ట్ర కో ఆర్డినేటర్, కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నీలం రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ జిల్లా నాయకులతో కలిసి షర్మిలతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిస్థితులపై చర్చించారు. పార్టీ బలోపేతంపై మాట్లాడినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు నీలం సుధాకర్ తదితరులున్నారు.

ఘనంగా దశాబ్ది వేడుకలు



కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహం వద్ద నేతలు

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





నృత్యం చేస్తున్న ఆరెపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద స్పీకర్ పోచారం, ఎమ్మెల్యే సింధే తదితరులు



విద్యార్థులను అభినందిస్తున్న స్పీకర్ పోచారం, ఎమ్మెల్యే, కలెక్టర్





అమరులకు నివాళులు అర్పిస్తున్న స్పీకర్



కలెక్టర్ జితేష్ వి పాటిల్



జెడ్పీ చైర్‌పర్సన్ శోభ





అదనపు కలెక్టర్లు దోత్రే, చంద్రమోహన్



ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



బల్దియా చైర్‌పర్సన్ జాహ్నవి



వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ



ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి



గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్

జెండా ఎగురవేసిన కలెక్టర్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్, క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని కోరారు. బంగారు తెలంగాణను సాధించడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు వెంకటేష్ ధోత్రే, చంద్ర మోహన్, కలెక్టరేట్ ఏవో రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



తెయూకు మంత్రి రూ.వెయ్యి కోట్లు తేవాలి

- అందరి సహకారంతోనే వర్సిటీ అభివృద్ధి
- కనివినీ ఎరుగని రీతిలో దశాబ్ది ఉత్సవాలు
- వీసీ రవీందర్



మాట్లాడుతున్న తెయూ వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సన్నిహితంగా ఉండే జిల్లాకు చెందిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.1000 కోట్లు నిధులు మంజూరు చేయించాలని వీసీ డి రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పరిపాలనా భవనం వద్ద వీసీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి ప్రశాంత్‌రెడ్డితో పాటు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ వర్సిటీ అభివృద్ధికి నిధుల గురించి సీఎంతో మాట్లాడాలని కోరారు. అందరు సహకరిస్తేనే యూనివర్సిటీ అభివృద్ధి సాధ్యమన్నారు. వీసీ ఒక తోవ, ఈసీ ఒక తోవ పోతే ఎలా అన్నారు. రిజిస్ట్రార్ నియామకం విషయం రెండు నెలలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఈసీకి రిజిస్ట్రార్ ను నియమించే అధికారం లేదని చెప్పారు. తనకు సమాచారం లేకుండానే ఈసీ సమావేశాలు నిర్వహిస్తున్నారని, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ఇది నేరమన్నారు. ఈ విషయాన్ని ఈసీ సభ్యులకు ఇప్పటికే చెప్పామని, అయినా తదుపరి సమావేశానికి వెళ్తే ఇంటర్నల్ ఈసీ సభ్యులను సర్వీస్ నుంచి సస్పెండ్ చేస్తామని వీసీ హెచ్చరించారు. వీసీని పక్కకు పెట్టి ఈసీ సభ్యులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని వారిపై సీరియస్ యాక్షన్ ఉంటుందన్నారు. పాలకమండలి వర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు. ఈసీ సభ్యులు విద్యార్థులను రెచ్చగొట్టి వీసీ ఛాంబర్‌కు పంపించడం దారుణమన్నారు. విద్యార్థుల కోరిక మేరకు సెలవులు రద్దు చేస్తున్నామని, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. న్యూసెన్స్ చేసే విద్యార్థులపై సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరించారు. దశాబ్ది ఉత్సవాలను తెయూలో పది రోజుల పాటు కనివినీ ఎరుగని రీతిలో ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్య, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో రౌడీషీటర్ హత్య కేసు నిందితులు!

ఖలీల్‌వాడి: రౌడీ షీటర్ ఆరిఫ్ డాన్ హత్య కేసులో ప్రధాన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. దొంగతనం కేసులో బోధన్ కోర్టుకు పేషీపై వెళ్లి వస్తుండగా ఆరిఫ్ డాన్‌ను హతమార్చిన విషయం తెలిసిందే.. ఏసీపీ కిరణ్‌కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం నిందితులను పట్టుకునేందుకు బోధన్‌కు చెందిన ఇద్దరు సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రాజు నేతృత్వంలో రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కేసులో కీలక నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. జనవరి 1న ఇబ్రహీం ఛావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బును చంపినందుకు ప్రతీకారంగా ఆరిఫ్‌ను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ఆరిఫ్‌ను చంపడానికి నగర శివారులో నిందితులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. గురువారం బోధన్ కోర్టుకు వెళ్తున్నడన్నా సమాచారం మేరకు నిందితులు హత్యకు వేసుకున్న ప్రణాళికను అమలు చేశారు. ఆరిఫ్‌ను హత్య చేసిన వారిలో అతనికి అత్యంత సన్నిహితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆరిఫ్ జైలు నుంచి వచ్చిన తర్వాత ఇబ్బు అనుచరులతో తనకు ప్రాణభయం ఉన్నట్లు అనుచరులకు చెప్పినట్లు సమాచారం. అంతేకాకుండా ఆరిఫ్ అనుచరులు ఇద్దరితో ఆర్థిక లావాదేవీల్లో తేడాలు రావడంతో తమను కూడా ఆరిఫ్ హత్య చేస్తాడని భావించినట్లు తెలిసింది. దీంతో ఆరిఫ్‌ను చంపడానికి వారు కూడా సహకరించినట్లు సమాచారం.

ఇందల్వాయి కేసులో ముగ్గురు!

ఖలీల్‌వాడి: ఇందల్వాయి వద్ద పోలీసుల కాల్పుల్లో తప్పించుకున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగల కోసం రెండు బృందాలు రాజస్థాన్ వెళ్లినట్లు తెలిసింది. ట్రాన్స్‌ఫార్మర్ దొంగల నుంచి రాగి కాయిల్స్‌ను కొనుగోలు చేసిన హైదరాబాద్‌కు చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. దొంగలు వదిలి వెళ్లిన కారు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ముఠా జిల్లాలో కాకుండా ఇతర ప్రాంతాల్లో సుమారు 150 నుంచి 200 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి అందులో నుంచి రాగికాయిల్స్‌ను తీసుకువెళ్లినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. రాజస్థాన్ ముఠా సభ్యులను పట్టుకునేందుకు పోలీసులు మూడు రోజులుగా అక్కడే మకాం వేశారు. దొంగలకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరించినట్లు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తీసిన రాగి కాయిల్స్‌ను హైదరాబాద్‌లో మూడు చోట్ల అమ్మినట్లు గుర్తించారు. రాగి కాయిల్ కొన్న వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

ఇంటిగ్రేటెడ్ పీజీ పరీక్ష ఫీజు గడువు 6 వరకు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ పీజీ (ఏపీఈ/పీసీహెచ్) కోర్సులకు సంబంధించి 8వ, 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ, ప్రాక్టికల్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 6 తుది గడువని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 9వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. అప్లయిడ్ ఎకనామిక్స్ రెగ్యులర్ అన్ని సబ్జెక్టులకు రూ.500, ఎమ్మెస్సీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ రెగ్యులర్ సబ్జెక్టులకు రూ.600 చెల్లించాలన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

అమరుల ఆశయాలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పాటైన బీఆర్ఎస్ ప్రభుత్వం అమరవీరుల ఆశయాలను తుంగలో తొక్కిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని ఇచ్చినందుకు సోనియాగాంధీకి ధన్యవాదాలు తెలుపుతూ నగరంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి మున్సిపల్ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా, వర్ని చౌరస్తా, గాంధీ చౌక్, రైల్వే స్టేషన్ మీదుగా తిరిగి కాంగ్రెస్ భవన్ వరకు ఈ ధన్యవాద మోటారు సైకిల్ ర్యాలీ జరిగింది. మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి, అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకే ప్రస్తుతం దశాబ్ది ఉత్సవాల అలజడి అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో రాష్ట్రం కోసం ప్రా ణాలర్పించిన అమరవీరుల ఆశయాలను, సోని యాగాంధీ లక్ష్యాలను కేసీఆర్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. కేవలం దోచుకోవడం, దాచుకోవడం అనేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన చేస్తోందని విమర్శించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకునే హక్కు కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. అర్బన్ ఇన్‌చార్జి తాహెర్‌బిన్ హందాన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణు రాజ్, కార్పొరేటర్ గడుగు రోహిత్, రామర్తి గోపి, విక్కీ యాదవ్, రాజ నరేందర్ గౌడ్, అభుద్ బిన్ హందాన్, సంతోష్, ముస్తాఫ, వినోద్, అష్రఫ్ పాల్గొన్నారు.

రేపు బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న ఆదివారం ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె సందీప్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–11 బాలురు, బాలికల నుంచి అండర్–75 వరకు పురుషులు, మహిళలు సింగిల్స్, డబుల్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8185866017 నంబరును సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

గ్యాస్ సిలిండర్ లీకై బాలికకు గాయాలు



గాయపడ్డ శృతి

తాడ్వాయి: తాడ్వాయిలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ లీకై బాలికకు గాయాలు అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన రుక్కుంబాయి తన మనవరాలు శృతితో కలిసి ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకైంది. దీంతో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన వారిద్దరు సిలిండరు బయటకు తీసుకొస్తుండగా శృతి కాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. ఇంట్లో ఉన్న కూలరు, కొంత నగదు కాలి బూడిదయింది. స్థానికులు కొంతమంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అగ్నిమాపక శకటం కూడా వచ్చి మంటలను చల్లార్చింది.

గుంజ్లిలో గుడిసె దగ్ధం

మాక్లూర్: మండలంలోని గుంజ్లిలో గురువారం అర్ధరాత్రి ఓ గుడిసె కాలిపోయింది. గ్రామానికి చెందిన సరికెల గంగవ్వ గుడిసెలో నివాసం ఉంటుంది. రాత్రి వంట చేసిన అనంతరం సిలిండర్ బంద్ చేయకుండానే నిద్రపోయింది. అర్ధరాత్రి లేచి విద్యుత్ బల్బు వేయటంతో ఒక్కసారిగా మంటలు అంటుకొని గుడిసె కాలిపోయింది. తహసీల్దార్ శంకర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. గంగవ్వకు రూ.5 వేల నగదు అందజేశారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

డొంకేశ్వర్: డొంకేశ్వర్ సర్పంచ్ భర్త నాయకుడి వెంకటస్వామి(చందు)పై గురువారం రాత్రి జరిగిన దాడి ఘటనలో పలువురిపై కేసు నమోదైంది. గ్రామానికి చెందిన శోభన్, కిషన్, చంద్రశేఖర్, దిలీప్, రామకృష్ణతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

ఎడపల్లి: మండలంలోని అంబం గ్రామానికి చెందిన బోయి గంగవ్వ(54) చెరువులో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గంగవ్వకు మతిస్థిమితం సరిగా లేదు. గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె శుక్రవారం అంబం చెరువులో శవమై తేలింది. మృతురాలి భర్త లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బైక్‌లో నుంచి బంగారం, నగదు చోరీ

బోధన్‌టౌన్: బోధన్‌లోని గోశాల ప్రాంతంలో ఏ1 పౌల్ట్రీ వద్ద గురువారం మధ్యాహ్నం బైక్ ముందు కవర్‌లో పెట్టిన 16 తులాల బంగారం, రూ.లక్షా 85 వేల నగదును ఎత్తుకెళ్లారు. సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ మస్తాన్ వ్యాపారం చేస్తుంటాడు. గురువారం మధ్యాహ్నం ఆచన్‌పల్లి కాలనీలోగల యూనియన్ బ్యాంకులో గోల్డ్ లోన్ డబ్బులు చెల్లించి 16 తులాల బంగారం విడిపించాడు. అనంతరం ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.లక్షా 85 వేల నగదును డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. బ్యాంకులో జనాలు ఎక్కువగా ఉండడంతో నగదుతో పాటు బంగారాన్ని తన ద్విచక్ర వాహనం ట్యాంకు కవర్‌లో పెట్టుకొని గోశాల ఏరియాకు వెళ్లాడు. ఏ1 పౌల్ట్రీ దుకాణం ఎదుట బైక్ నిలిపి దుకాణంలో గుడ్లు కొనుగోలు చేయడానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి వాహనం ముందు కవర్‌లో పెట్టిన బంగారం, నగదు బ్యాగ్ కనిపించలేదు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడు చిన్న గంగాధర్ తెలిపిన వివరాలు.. గంగాధర్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంగ్లాపై నిద్రిస్తున్న సమయంలో దొంగలు తాళం ధ్వంసం చేసి లోనికి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే పాస్‌పోర్ట్, పట్టాపాస్‌బుక్ సైతం చోరీ చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ఘటనా స్థలంలో పడిపోయిన శంకర్

ఎడపల్లి: మండలంలోని జంలం శివారులో శుక్రవారం బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో బోధన్‌లోని రాకాసిపేటకు చెందిన కందికట్ల శంకర్(48) మృతిచెందగా అతని భార్య, కూతురుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాకాసిపేటకు చెందిన కందికట్ల శంకర్, మల్లేశ్వరి దంపతుల కూతురు గాయత్రికి సారంగాపూర్ మైనార్టీ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీటు వచ్చింది. ఆమెను అడ్మిషన్ చేసి బోధన్ తిరిగి వెళ్తుండగా జంలం శివారులో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. శంకర్‌కు తీవ్రగాయాలు కాగా కూతురు, భార్యకు స్వల్పగాయాలు అయ్యాయి. శంకర్‌ను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతిచెందాడు. మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

టాటా ఏస్ ఢీకొని ఒకరు..

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ శివారులో కామారెడ్డి, సిరిసిల్ల రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు.. లింగంపేట మండలం బానాపూర్‌కు చెందిన కొత్తూరు చిప్ప రాజు(40) కొద్ది రోజులుగా బాన్సువాడలో నివసిస్తున్నాడు. సొంత పనుల నిమిత్తం సిరిసిల్ల నుంచి తిరిగి బాన్సువాడ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ టైరు పేలి రాజు బైక్‌ను ఢీకొనగా కింద పడిపోయాడు. దీంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

పిట్లం: మండలంలోని చిన్నకోడప్‌గల్ గ్రామ శివారులో 161 జాతీయ రహదారిపై శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. పెద్ద కొడప్‌గల్ మండలంలోని దేవిసింగ్ తండాకు చెందిన గోతి శ్రీరామ్ బైక్‌పై పిట్లం వెళ్తుండగా చిన్నకొడప్‌గల్ శివారులో ఎదురుగా వస్తున్న పిట్లంకు చెందిన కాశిరాం బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను హైవే సిబ్బంది అంబులెన్స్‌లో పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎక్సెల్ అదుపు తప్పి ఒకరికి..

పెద్దకొడప్‌గల్: మండలంలోని జగన్నాథ్‌పల్లి తండా సమీపంలో టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. చిల్లర్గి గ్రామానికి చెందిన పీఎంపీ సాయిలు శుక్రవారం పెద్దకొడప్‌గల్ నుంచి బిచ్కుంద వైపు వెళ్తుండగా.. బస్సును ఓవర్ టేక్ చేయబోయి అదుపు తప్పి పడిపోయడు. తీవ్రంగా గాయపడ్డ ఆయనను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.